## క్లుప్తంగా

### నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొన వచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

### బంగారుమెట్టలో విద్యుత్ దీపాల ఏర్పాటు



కొత్తగా ఏర్పాటు చేసిన వీధి దీపాలను చూపిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు బంగారమ్మ మెట్ట సచివాలయం వెనుక గల స్థానికులు వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాముకు తెలియజేయటంతో ఆయన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు జీవీఎంసీ విద్యుత్ సిబ్బంది బుధవారం విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు, పచ్చిరిపల్లి రాముకు ధన్యవాదాలు తెలిపారు.

### పిల్లలకు పెద్దలపై గౌరవం అవసరం



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: పిల్లలకు పెద్దలు, గురువులపై గౌరవం ఉండాలని మేగా వేదాంత సమితి ఆశారాం బాపు శిష్యులు శరత్‌చంద్ర ప్రభు, పరమేశ్వర ప్రభు సూచించారు. ఆరిలోవ భారతి స్కూల్‌లో బుధవారం తల్లిదండ్రుల పాద పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పాదాలకు పూజ చేశారు. అనంతరం బాపు శిష్యులు మాట్లాడుతూ తల్లిదండ్రులను దైవంతో సమానంగా భావించాలన్నారు. ఇటీవల కాలంలో కొందరు తల్లిదండ్రులను అనాథ శరణాలయాల్లో విడిచిపెడుతున్నారని... ఇది చాలా బాధాకరమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మంచి మార్గంలో నడవాలని సూచించారు. పాఠశాల కరెస్పాండెంట్ ఎం.వి. రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ ఎస్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేయర్ కోర్సులో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 15 సంవత్సరాలు నిండి, 45 సంవత్సరాల లోపు, ఇంటర్ చదివినవారు అర్హులని పేర్కొన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94903 91324 నంబరులో సంప్రదించాలని సూచించారు.





- కొబ్బరితోట వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న సురక్ష శిబిరం
- 502 మందికి ఉచిత పరీక్షలు, వైద్య సేవలు, మందుల అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గత పాలకులకు భిన్నంగా ప్రజల సంక్షేమం కోసం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తోన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పెద్ద ఎత్తున సురక్ష శిబిరాలు నిర్వహింపజేస్తున్నారు. పేదలకు ఉచితంగా పరీక్షలు, వైద్య సేవలు, మందులు అందజేస్తూ అందరికీ ఆరోగ్యం అనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. అందులో భాగంగా కొబ్బరితోటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. పేదలకు ఉచితంగా వైద్యం, మందులు అందజేశారు. అవసరమైన వారికి మరింత మెరుగైన వైద్యం కోసం **కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేశారు.**

# ముంగిళ్లలోనే.. మెరుగైన వైద్యం



రోగిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



పేర్లు నమోదు చేసుకుంటున్న లబ్ధిదారులు



లబ్ధిదారులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం : ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా ప్రజల దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా పరీక్షలు, వైద్యం, మందులు అందజేస్తున్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నారు. జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట-1 సచివాలయం పరిధిలో ఉన్న వారికి బుధవారం కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఉచితంగా పరీక్షలు, వైద్యం, మందులు అందజేశారు. యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పి.మహాలక్ష్మి 502 మందికి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా సీజనల్ జ్వరాలు, షుగర్, దగ్గు తదితర వ్యాధులతో వచ్చిన ప్రజలకు వైద్యం అందజేశారు. కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో అవసరమైన వారిని మెరుగైన వైద్యం నిమిత్తం రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



39వ వార్డులో ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



34వ వార్డులో ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సాయం కోరుతున్న ప్రతి ఒక్కర్నీ ఆదుకోవడమే ధ్యేయంగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముందుకు నడుస్తున్నారు. నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందుతున్నారు. తన సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో ఆపదలో ఉన్న పలువురికి రూ.45 వేలు ఆర్థిక సాయం అందజేసి మీకు నేను న్నానంటూ భరోసా కల్పించారు. 34వ వార్డు భూపేష్‌నగర్‌కు చెందిన ఈతలపాక గంగమ్మ, కొబ్బరితోటకు చెందిన వాసుపల్లి నూకాలమ్మ, కంసాల వీధికి చెందిన అల్లు ముత్యాలమ్మ, 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌కి చెందిన జెర్రిపోతుల అమ్మాజీకి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 37వ వార్డు రామాలయం వీధికి చెందిన గుడ్ల వెంకటేష్ కుటుంబానికి రూ.5 వేలు, 38వ వార్డు సోల్జర్‌పేటకు చెందిన దూడ బంగారి, 39వ వార్డు థాంప్సన్ స్ట్రీట్‌కి చెందిన పుక్కళ్ల ప్రసాద్ కుటుంబానికి, అంబుసరంగ్ వీధికి చెందిన వాడమొదుల పైడిరత్నం, చిలకపేటకు చెందిన వాసుపల్లి ధనమ్మ కుటుంబానికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసి మీ కష్టానికి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలు నిండు మనసుతో అందజేస్తున్న ఆశీర్వచనాలే తన గెలుపునకు దీవెనలని పేర్కొన్నారు. ఆప్యాయంగా పలకరించే నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, సాయం అందించడానికి సహకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, పలు ఆలయాల చైర్మన్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

## దివంగత సీఎం దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి



దివంగత నేత దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట : మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. విశాఖ జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం సంజీవయ్య 103వ జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, సీఈవో ఎం. పోలినాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఇటు రాష్ట్రానికి, అటు దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన జీవిత చరిత్ర, విశేషాల గురించి వివరించారు. పేద కుటుంబంలో జన్మించిన సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా అతి చిన్న వయసులోనే అమూల్యమైన సేవలందించారన్నారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన ఆయన నిరాడంబరతకు మారుపేరుగా, నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచారన్నారు. ఆయన బాటలో అందరూ పయనించి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక సమ్మె జయప్రదానికి పిలుపు



బైక్ ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాలు

సీతమ్మధార : నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని నర్సింగరావు ప్రారంభించారు. జగదాంబ, లేపాక్షి, చౌట్రీ, పూర్ణామార్కెట్, కొత్తరోడ్డు మీదుగా సాగిన ర్యాలీ తిరిగి జీవీఎంసీ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు, కార్మికులకు నష్టదాయకమైన చట్టాలు చేసిందన్నారు. వ్యవసాయ రంగాన్ని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థల పరం చేయడానికి పూనుకుందన్నారు. 2024 ఎన్నికల్లో మోదీ తిరిగి అధికారంలోకి వస్తే వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు గత మూడేళ్లుగా ప్రజలు ఉద్యమం సాగిస్తుంటే దున్నపోతు మీద వర్షం కురిసినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. 16వ తేదీ పోరాటానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అచ్యుతరావు, ఆర్‌ఎస్‌వీవీ కుమార్, కె.ఎం. శ్రీనివాసరావు, ఎం.మన్మథరావు, దేవా, పి.మణి, పడాల రమణ, రెహ్మాన్, వై.రాజు, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి పసుపు నీటితో జలాభిషేకం చేశారు. కొత్త చీర, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి, ట్రస్టు సభ్యులు, ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

## వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసాలు



సంపత్ వినాయగర్ ఆలయంలో అక్షరాభ్యాసానికి హాజరైన చిన్నారులు, తల్లిదండ్రులు



అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లులు

దాబాగార్డెన్స్ : వసంత పంచమి సందర్భంగా బుధవారం పలు ఆలయాలు, పాఠశాలల్లో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన కార్యక్రమంలో పలువురు చిన్నారులచే అక్షరాభ్యాసం చేయించారు. పలక, పెన్ను, పుస్తకాన్ని దేవస్థానమే ఉచితంగా అందజేసింది.

**సామూహిక అక్షరాభ్యాసాలు**

సీతమ్మధార : వసంత పంచమి సందర్భంగా ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో ప్రధాన అర్చకులు మోహన్‌స్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ముందుగా గణపతిపూజ, సరస్వతీ పూజ చేశారు. చిన్నారులకు పలకలపై అక్షరాలు రాయించారు. అనంతరం సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు సంపత్ వినాయకుడిని దర్శించుకున్నారు. మోహన్‌స్వామి ఆధ్వర్యంలో మణికంఠస్వామి పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు.

## సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మహారాణిపేట : రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు నల్లబాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అన్ని మండల కార్యాలయాలు, హైస్కూళ్లు, పీఆర్ కార్యాలయాల్లో గల మూడు జిల్లాల ఉద్యోగులు నిరసన వ్యక్తం చేసినట్టు సంఘం అధ్యక్షుడు సత్తిబాబు వివరించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే మూడేళ్ల నుంచి తమకు రావాల్సిన సరెండర్ లీవ్ చెల్లింపులు, డీఏ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈనెల 27 వరకు ఉద్యమ కార్యాచరణలో ఉద్యోగులందరూ భాగస్వాములు కావాలని సత్తిబాబు కోరారు.

**ఎన్‌జీవోల నిరసన ప్రదర్శన..**

వివిధ సమస్యల సాధనకు ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు నాయకత్వం వహించారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన జరుగుతుందని ఆయన తెలిపారు.

## ఆర్టీసీ కార్మికులకు ప్రాంతీయ ఆస్పత్రి నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

ఉక్కునగరం: విశాఖలో 25 పడకల ప్రాంతీయ ఆర్టీసీ ఆస్పత్రి నిర్మించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన స్టీల్‌సిటీ డిపోను సందర్శించారు. అక్కడ జరిగిన ఈయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో ఆస్పత్రి నిర్మిస్తే చుట్టుపక్కల జిల్లాలకు చెందిన ఉద్యోగులకు వైద్య సదుపాయం అందుతుందన్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ తిరుమలరావుకు లేఖ అందించామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి పి.భానుమూర్తి, విజయనగరం జోనల్ అధ్యక్షుడు కె.జె.శుభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తి, జ్ఞాన మార్గాల ద్వారానే భగవదనుగ్రహం



హనుమద్వైభవాన్ని వివరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

ఎంవీపీకాలనీ: భక్తి, జ్ఞాన మార్గాల ద్వారా మాత్రమే భగవదనుగ్రహాన్ని పొందగలమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో నిర్వహిస్తున్న హనుమద్వైభవ ప్రవచనాల్లో భాగంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆంజనేయుడిని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించినట్లే అన్నారు. మార్గశిర మాసంలో హనుమారాధన శుభప్రదమన్నారు. పలు అధ్యాత్మిక అంశాలపై భక్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య బ్రదర్స్ భక్తి సంగీత విభావరి అలరించింది. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రవచనాలు బుధవారంతో ముగిశాయి.

## కుష్టురోగులకు వస్తువుల వితరణ

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా కుష్ఠునివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం 'స్పర్శ' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవివరంలోని ఏఎంజీ లెప్రసీ కాలనీలో 53 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు డిప్యూటీ పారా మెడికల్ అధికారులు .కె.ప్రసాదరావు,పి.రామకృష్ణ బియ్యం, పప్పు, పండ్లు,సెల్ఫ్ కేర్ కిట్స్, మందులు పంపిణీ చేశారు. వ్యాధి గ్రస్తులు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను, మందులు వాడడం గురించి రోగులకు వివరించారు. డీపీఎంవో పి.రామకృష్ణ, ప్రసాదరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో అతిథులు, ఝాన్సీ లక్ష్మీబాయి విభాగం సభ్యులు

తాటిచెట్లపాలెం: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం తాటిచెట్లపాలెంలోని విశ్వతేజ స్కూల్‌లో గురువందన్ చాత్ర అభినందన్ (వసంత పంచమి) వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మీబాయి విభాగం అధ్యక్షురాలు సత్యశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో విధులు నిర్వర్తిస్తున్న జాతీయ పురస్కార గ్రహీతలైన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఫలితా లు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామా దాడి ఘటనలో అసువులు బాసిన దేశ వీర సైనికులకు నివాళులర్పించారు. పుల్వామా దాడి ఘటనను, సైనికుల త్యాగాలను విద్యార్థులకు నృత్యరూపకం ద్వారా తెలియజేశారు. బ్రిగేడియర్ సత్య, రియర్ అడ్మిరల్ టి.సుధాకర్, విశ్వతేజ స్కూల్ కరెస్పాండెంట్ ఐ.భాస్కరరావు, ప్రిన్సిపాల్ ఐ.సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మానవ జీవితంలో ముఖ్య భూమిక ప్రేమదే..



ప్రసంగిస్తున్న చిన సూర్యనారాయణ

సీతమ్మధార: వాలెంటైన్స్ డే సందర్భంగా సహృదయ సాహితీ ఆధ్వర్యంలో బుధవారం రామకథ-ప్రేమ సుధ అనే అంశంపై సాహితీవేత్త సీహెచ్ చినసూర్యనారాయణ ప్రసంగించారు. రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో కె.జి.వేణు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రేమ మానవ జీవితంలో ముఖ్య భూమిక పోషిస్తూ మానవ విలువలను, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు. ఈ ప్రేమ ఘట్టాలు రామాయణంలో ఎక్కువగా కనిపించి, సమాజానికి గొప్ప సందేశాన్ని అందిస్తాయని చెప్పారు. రామాయణంలో తండ్రీకొడుకుల ప్రేమ, భార్యాభర్తల ప్రేమ, స్నేహితుల ప్రేమ, ప్రజలు-ప్రభువు ప్రేమ ఆయా పాత్రల్లో మనకు కనిపిస్తుంటాయన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త డి.వి.సూర్యారావు, కొత్తూరు రమణ, కె.భీమేశ్వరరావు, భాగవతుల సత్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## లలితాదేవికి అష్టోత్తర శత కలశాభిషేకం

ఏయూక్యాంపస్: స్థానిక శ్రీ లలితాసుందరేశ్వర పీఠం వార్షికోత్సవాలలో భాగంగా బుధవారం శ్రీ లలితా త్రిపుర సుందరి అమ్మవారికి అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ చక్ర ఆవరణార్చన నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారి అభిషేక సేవలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## పరిశోధకుల మెస్ పరిశీలన



మెస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధకుల మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మికంగా మెస్ తనిఖీ చేసి పరిశోధకులతో మాట్లాడారు. భోజన నాణ్యత అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలు, కిచెన్ పరిశీలించారు. హాస్టల్ మెస్‌లో సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. హాస్టల్ వార్డెన్లు, చీఫ్ వార్డెన్లు నిరంతరం విద్యార్థుల భోజన సదుపాయాలు పర్యవేక్షించాలని సూచించారు. ఆయనవెంట చీఫ్ వార్డెన్ ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య జి.వీర్రాజు ఉన్నారు.

## పవర్ లిఫ్టింగ్‌లో ఉక్కు ఉద్యోగికి బంగారు పతకం

పెదగంట్యాడ: సూపర్ మాస్టర్స్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 13 వరకు గోవా జీఎంసీలోని బొలియన్ అథ్లెటిక్స్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో వుడా కాలనీకి చెందిన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి సత్తా చాటారు. బీఎఫ్ డిపార్ట్‌మెంట్‌లో జనరల్ ఫోర్‌మన్‌గా పని చేస్తున్న అండిబోయిన అప్పారావు ఈ గేమ్స్‌లో పాల్గొని 2024 ఇండియన్ చాంపియన్ షిప్ విజేతగా నిలిచి బంగారు పతకం సాధించారు. మాస్టర్ టూ బాడీవెయిట్ 93కిలోల విభాగంలో ఈ ఘనత సాధించారు. ఈ మేరకు ఆయనకు నేషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహకుడు సురేష్ సెల్వజి బంగారు పతకాన్ని బహూకరించారు. ఈ పోటీల్లో 18 రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.